క్లుప్తంగా

126 మందికి కంటి పరీక్షలు



కంటి ఆపరేషన్ల కోసం వేమగిరి ఆస్పత్రికి రోగులను తీసుకువెళుతున్న నిర్వాహకులు

పెదపూడి: పెదపూడి గ్రామంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి నెలా మూడో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సేవా సమితిలో ఆవరణలో ప్రతి మంగళవారం హోమియోపతి వైద్య శిబిరం కూడా జరుగుతుందన్నారు. కాగా.. వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయం వైద్యులు శిబిరంలో 126 మందికి కంటి పరీక్షలు జరిపారు. వారిలో 18 మందికి ఆపరేషన్లు, 22 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో స్థానిక సేవా సమితి కన్వీనర్ మార్ని సత్యనారాయణ చౌదరి, సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

రంగంపేట: వడిశలేరు గ్రామంలోని ఏడీబీ రోడ్డు పక్కన కొలువైన విజయ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. ఉదయం ఆలయ అర్చకుడు రేగడమిల్లి రాందేవ్ శర్మ ఆధ్వర్యంలో అభిషేకాలు, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరుగుతుంది.

ప్రతిభ చూపిన విద్యార్థికి సత్కారం



శ్యామ్‌కుమార్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం పార్థసారథి

రంగంపేట: ప్రతి విద్యార్థి శ్యామ్ కుమార్‌ను ఆదర్శంగా తీసుకుని పరీక్షల్లో మంచి ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి సూచించారు. ఆ పాఠశాలలో గురువారం జరిగిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో పాఠశాలకు చెందిన కోశెట్టి శ్యామ్‌కుమార్ 581 మార్కులతో పాఠశాలలో ప్రథమ, మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడు. అనంతరం తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సైన్సు సబ్జెక్టుకు రీవెరిఫికేషన్ పెట్టడంతో మరో మూడు మార్కులు పెరిగి 584 మార్కులతో మండలంలో ప్రథమస్థానంలో నిలిచాడు. ఈ సందర్భంగా శ్యామ్ కుమార్‌ను హెచ్‌ఎమ్, ఉపాధ్యాయులు అభినందించారు.

18 నెలల జీతాలు అందించండి

సీతానగరం: తమ పద్దెనిమిది నెలల జీతాలు అందించాలని పురుషోత్తపట్నంలోని సత్యసాయి వాటర్ ప్రాజెక్ట్ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడుతూ తమకు 18 నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదని, ఇది వరకు సమ్మె చేస్తే కొంత ఇచ్చారని, తరువాత మానేశారన్నారు. పూర్తిస్థాయిలో వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ప్రాజెక్టులో యంత్రాలు మరమ్మతులకు గురవుతున్నాయని, పరికరాలు తుప్పు పడుతున్నాయని వాపోయారు. తమ జీతాలు ఇవ్వకుంటే సమ్మెబాట పడతామని హెచ్చరించారు.

ముంపు ముప్పుపై ఇంత నిర్లక్ష్యమా?

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతుల ఆందోళన
- పగిలిన లో కల్వర్టు తూరలు
- వర్షం కురిస్తే ముంపులోకి పంటలు



చినకొండేపూడి- చీపురుపల్లి రోడ్డుపై కల్వర్టును పరిశీలిస్తున్న రైతులు



కల్వర్టులో గ్రావెల్‌తో మూసుకుపోయిన తూరలు

సీతానగరం: చినకొండేపూడి – చీపురుపల్లి గ్రామాల మధ్యలో గల లోకల్వర్టు తూరలు పగిలిపోయాయని, వాటి స్థానంలో తాత్కాలికంగానైనా తూరలు వేసి నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రైతులు గురువారం ఆందోళనకు దిగారు. పార్టీ నియోజకవర్గ ఎంప్లాయిస్, పెన్షనర్ల విభాగం అధ్యక్షుడు పోలినాటి ఈశ్వరుడు ఆధ్వర్యంలో నాయకులు ముదునూరి రామకృష్ణంరాజు, ముదునూరి ప్రసాదరాజు, కోనే శ్రీనివాస్ (ఇంద్ర), రైతులు గొంతి అప్పారావు, పచ్చమట్ల కృష్ణంరాజు, మల్లిరెడ్డి రమణ, లక్కిశెట్టి శివ, కోటి నాగేశ్వరరావుతో పాటు పెద్ద సంఖ్యలో రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కల్వర్టును పరిశీలించిన అనంతరం రోడ్డుపై టెంట్ వేసి నినాదాలు చేశారు.

రైతుల ఆవేదన

కల్వర్టు తూరలు పూడుకుపోవడంతో ఖరీఫ్ పంట సమయంలో వర్షం నీరు ముందుకు వెళ్లదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే వర్షాల సమయంలో రోడ్డుపై నుంచి నీరు వెళ్లడంతో రాకపోకలకు కూడా అవస్థలు ఎదురవుతాయని వాపోయారు. ఆ సమయంలో పెదకొండేపూడి నుంచి పది కిలోమీటర్లు తిరిగి పొలాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. ఎరువులను, కూలీలను తీసుకువెళ్లడం కూడా కష్టమేనని చెబుతున్నారు. తూరలు ఏర్పాటు చేయకపోతే సుమారు 1,000 ఎకరాలు ముంపులోకి చేరుకుంటాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కాగా.. చినకొండేపూడి - చీపురుపల్లి రోడ్డులోని అప్పన చావిడి వద్ద గల ఈ కల్వర్టుపై నుంచి అధిక లోడుతో క్వారీ లారీలు వెళ్లడంతో నాలుగు నెలల క్రితం సిమెంట్ తూరలు పగిలిపోయాయి. దీంతో భారీ వాహనాల రాకపోకలకు వీలుగా తూరలపై రోడ్డుకు సమాంతరంగా గ్రావెల్ వేశారు.

వైఎస్సార్ సీపీ హయాంలో..

అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషితో చినకొండేపూడి - చీపురుపల్లి మీదుగా నాగంపల్లి వరకు రోడ్డుకు రూ.21 కోట్లు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మంజూరయ్యాయి. సింగిల్ రోడ్డును డబుల్ రహదారిగా విస్తరణ పనులు చేపట్టారు. దానిలో భాగంగా ఈ లోకల్వర్టు వద్ద వంతెన నిర్మించాలి. రోడ్డుపై వెట్ మిక్స్‌ను వేసి తారురోడ్డు వేయాల్సిన సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి.

రైతులకు అవస్థలే..



కల్వర్టులో తూరలు పగిలిపోవడంతో లారీలు వెళ్లడానికి గ్రావెల్ వేశారు. దీనితో తూరలు మూసుకుపోయి నీరు ముందుకు ప్రవహించడం లేదు. అలాగే వర్షాలు కురిసినప్పుడు కల్వర్టు పైనుంచి నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి ఉంటుంది. తాత్కాలికంగానైనా తూరలు ఏర్పాటు చేయాలి.

– పెన్మత్స అప్పలరాజు, రైతు, చినకొండేపూడి

ముంపులోకి వెయ్యి ఎకరాలు



కల్వర్టు వద్ద తాత్కాలిక పనులైనా చేపట్టకపోతే రైతులకు కష్టాలు తప్పవు. అధిక వర్షాలకు రోడ్డుపై నుంచి నీరు వెళ్లి మార్గం మూసుకుపోతుంది. ఆ సమయంలో పెదకొండేపూడి నుంచి పది కిలోమీటర్లు దూరం నుంచి తిరగేసుకుని వెళ్లాలి. అలాగే ఎగువన వెయ్యి ఎకరాలు ముంపులోకి వెళుతుంది. రైతులు తీవ్రంగా నష్టపోతారు.

– మేడిశెట్టి త్రిమూర్తులు, రైతు, చినకొండేపూడి

పట్టించుకోలేదు



లోకల్వర్టు వద్ద తూరలు పగిలిపోయాయని, వర్షాకాలంలో పంటపొలాలు ముంపులోకి వెళ్లతాయని ఎమ్మెల్యేకు, అధికారులకు తెలిపినా ఎటువంటి చర్యలు చేపట్టలేదు. అందరికీ ఈ సమస్యపై వినతి పత్రాలు అందించాం. తూరలు పగిలిపోవడంతో నీరు నిలిచిపోయింది. వర్షాకాలంలో నీరు వెళ్లడానికి మార్గం లేక పలు ఇబ్బందులు రైతులు ఎదుర్కోవాల్సి వస్తుంది. శాశ్వత పనులు చేపట్టడానికి సమయం లేకుంటే, తాత్కాలిక పనులైనా చేపట్టాలి.

– పోలినాటి ఈశ్వరుడు, వైఎస్సార్ సీపీ ఎంప్లాయిస్, పెన్షనర్స్ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు, చినకొండేపూడి

ప్రజాప్రతినిధులపై నిర్లక్ష్యం సరికాదు

- గ్రామాల అభివృద్ధిలో వారిది కీలకపాత్ర
- అధికారులు తీరు మార్చుకోవాలి
- మండల పరిషత్ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు



విద్యుత్ సమస్యలపై ఏఈ శిరీషను ప్రశ్నిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు

రంగంపేట: గ్రామాల అభివృద్ధిలో కీలకంగా వ్యవహరించే స్థానిక ప్రజాప్రతినిధులపై మండల స్థాయి అధికారులు నిర్లక్ష్యం వహించడం ఎంతవరకు సమంజసమని జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ప్రశ్నించారు. ఏ గ్రామమైనా అభివృద్ధి చెందాలంటే ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీల కృషి ఎంతో ఉంటుందన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తమ గ్రామాల్లో ప్రభుత్వ పరంగా జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు, సభలు, సమావేశాలకు ఆయా శాఖల అధికారులు కనీసం సమాచారం ఇవ్వడం లేదని సభ దృష్టికి తీసుకువచ్చారు.

అధికారుల తీరుపై అసహనం

అధికారుల తీరుపై జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు అసహనం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులకు తగిన గుర్తింపునివ్వాలని, మళ్లీ ఇలాంటి పరిస్థితి వస్తే అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. పెద రాయవరంలో వ్యవసాయ అధికారులు రైతులతో సమావేశం ఏర్పాటు చేశారని, కానీ ఆ విషయాన్ని అక్కడ ఉన్న సర్పంచ్, ఎంపీటీసీకి సమాచారం ఇవ్వలేదని ఎంపీటీసీ మాచిన మమతారాణి గోవిందరాజు ఆరోపించారు. దీనిపై మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు సభాముఖంగా క్షమాపణలు చెప్పి, మళ్లీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

- జలకళ పథకంలో ఎప్పుడో నిర్మించుకున్న వ్యవసాయ బోర్లకు ఇప్పటి వరకు విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వలేదని, మర్రిపూడి, నల్లమిల్లి గ్రామాల్లోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి ఆ శాఖ అధికారులు ప్రాధాన్యం ఇవ్వడం లేదని ఎంపీపీ, సర్పంచ్‌లు ఆరోపించారు. వీలైంత త్వరగా ఆ సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్ శాఖ ఏఈ తోట శిరీష తెలిపారు.
- జి.దొంతమూరు అంగన్‌వాడీ కేంద్రం – 2లో అంగన్‌వాడీ టీచర్, హెల్పర్ లేకపోవడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని, నల్లమిల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో నాసిరకం కోడిగుడ్లు ఇస్తున్నారని వైస్ ఎంపీపీ మట్టా శ్రీను ఫిర్యాదు చేశారు. ఆ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఇన్‌చార్జి ఐసీడీఎస్ పీఓ సత్యవతి తెలిపారు.
- ఉపాధి హామీ పథకంలో ఇష్టానుసారంగా మస్టర్లు వేసుకుంటున్నారని, కనీసం అధికారులు పర్యవేక్షణ చేయడం లేదని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఆరోపించారు. ఇకపై అన్ని గ్రామాల్లో పర్యవేక్షణ చేస్తానని ఏపీఓ నాగేశ్వరి సభకు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మండల అధికారుల తమ శాఖల నివేదికలను సభలో వివరించారు. అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకోవాలని ఎంపీడీఓ వీరసాయిబాబు సూచించారు.
- అనంతరం ఇటీవల అహ్మదాబాద్‌లో విమాన ప్రమాద దుర్ఘటనలో మృతులకు సంతాపంగా సభ మౌనం పాటించింది. కార్యక్రమంలో తహసీల్దార్ కోసు అనసూయ, ఎంపీడీఓ వీర సాయిబాబు, వైస్ ఎంపీపీలు మట్టా శ్రీను, రాయుడు రాంబాబు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ పని కల్పిస్తాం



బిక్కవోలులో ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

బిక్కవోలు: అడిగిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని డ్వామా పీడీ నాగ మహేశ్వరరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం జాతీయ ఉపాధి హామీ పనుల 18వ తనిఖీ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట ప్రకారం అడిగిన 15 రోజుల్లో పని కల్పించాలన్నారు. 2024 ఏప్రిల్ 1 నుంచి 25 మార్చి 31 వరకూ జరిగిన పనులకు సంబంధించి ఆడిట్ పూర్తయిందన్నారు. మండలంలోని 1,466 పనులు చేపట్టారని, వేతనంగా రూ.9,16,19,461 చెల్లింపు చేయగా, సామగ్రికి రూ.2,82,56,849 చెల్లించినట్లు తెలిపారు. మొత్తం రూ.11,98,76,310 చెల్లింపులు జరిగాయన్నారు. కార్యక్రమంలోని ఎంపీపీ తేతలి సుమ, సామాజిక తనిఖీ డీడీ రామారావు, జిల్లా విజిలెన్సు అధికారి రత్నబాయి, ఎస్పీఎం (రాష్ట్ర ప్రోగ్రామ్ అధికారి) గౌరీ శంకర్, ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా వేణుగోపాలస్వామి కల్యాణం



తొస్సిపూడిలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

బిక్కవోలు: తొస్సిపూడి గ్రామంలోని రుక్మిణి, సత్యభామా సమేత వేణుగోపాల స్వామివారి కల్యాణాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మహేంద్రవాడ గ్రామానికి చెందిన తాడి విజయ వెంకట సూర్యమణికంఠ రెడ్డి, స్వర్ణలత దంపతులు కల్యాణకర్తలుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచి కొవ్వూరి సీతారత్నం, కర్రి శ్రీనివాసరావు, పందలపాక సొసైటీ మాజీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, నందిని చారిటబుల్ ట్రస్ట్ అధినేత కొవ్వూరి వెంకటరెడ్డి, జీఎస్ఎన్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఏవో సూర్య రమేష్‌కు సన్మానం



సూర్య రమేష్‌ను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతానగరం: మండల వ్యవసాయశాఖాధికారి కె.సూర్య రమేష్‌ను వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా సన్మానించారు. రాజమహేంద్రవరం అర్బన్‌కు పీఏ టు ఏడీఏగా బదిలీ అయిన ఆయనను వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వలవల వెంకట్రాజు (తోటలో రాజు), మండల సర్పంచ్‌ల సమాఖ్య సంఘం అధ్యక్షుడు కోండ్రపు ముత్యాలు, పార్టీ నాయకులు పెదపాటి ప్రసాద్ తదితరులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

సీతానగరం: సికిల్ సెల్ వ్యాధి కారణంగా శరీరంలోని ఎర్ర రక్తకణాలు తమ సహజ రూపాన్ని కోల్పోయి, కొడవలి ఆకారంలోకి మారిపోతాయని పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ ఏవీకే చైతన్య తెలిపారు. సీతానగరం పీహెచ్‌సీ వద్ద గురువారం వైద్యులు చైతన్య, సునీల్ ఆధ్వర్యంలో ప్రపంచ సికిల్ సెల్ వ్యాధి వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ చైతన్య మాట్లాడుతూ ఈ వ్యాధితో రక్త కణాలు క్షీణించి రక్తహీనత, తీవ్రమైన ఒళ్లునొప్పులు, శ్వాసకోశ వ్యాధులు, అలసట, వ్యాధినిరోధక శక్తి తగ్గిపోవడం, పెరుగుదల లోపాలు కలుగుతాయన్నారు. రక్త పరీక్ష ద్వారా ఈ వ్యాధిని నిర్ధారణ చేయవచ్చని, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా మందులు పొందవచ్చన్నారు.

యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: ఈనెల 21న జరిగే యోగా దినోత్సవానికి అందరూ హాజరై విజయవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణ రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులు, సచివాలయం కార్యదర్శులకు యోగాంధ్ర కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రతి గ్రామంలో 9 ప్రదేశాల్లో యోగాసనాలు వేయాలన్నారు. విద్యార్థులు, డ్వాక్రా సంఘాల మహిళలు, ప్రజాప్రతినిధులు విధిగా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ నరేంద్రరెడ్డి, తహసీల్దార్ సీతాపతిరావు, పాఠశాల పీడీ కావురు సాయి, ఎంఈఓ సీవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు సర్వసభ సమావేశం

బిక్కవోలు: ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ సమావేశం జరుగుతుందని ఎంపీడీవో శ్రీనివాస తెలిపారు. సమావేశానికి అధికారులు తమ నివేదికలతో రావాలని కోరారు.

చిత్రలేఖనం పోటీలు



తాము గీసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు

సీతానగరం: బొబ్బిల్లంక జిల్లా పరిషత్ హైస్కూల్లో హెచ్‌ఎం కోలా సత్యనారాయణ ఆధ్వర్యంలో విద్యార్థులకు గురువారం యోగాంధ్ర చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో 9వ తరగతి విద్యార్థిని తేజస్విని ప్రథమ, నరేష్ కుమార్ ద్వితీయ స్థానాలు సాధించారు. హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో యోగాపై అవగాహన పెంచడానికి ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. ఉపాధ్యాయులు యు.రామకృష్ణ, టి.మాచారమ్మ, బి.సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజానగరం: వెలుగుబంద విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌పై వార్షిక మరమ్మతులు కోసం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాను నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆపరేషన్) నటరాజన్ తెలిపారు. ఆ సమయంలో వెలుగుబంద, జేహెచ్‌సీ కాలనీలకు విద్యుత్ నిలిపివేస్తామన్నారు.

దత్త పీఠంలో ప్రత్యేక పూజలు

అనపర్తి: గ్రామంలోని దత్త పీఠంలో అనఘాష్టమిని పురస్కరించుకుని గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమియో వైద్య నిపుణుడు డాక్టర్ మల్లిడి సత్యనారాయణరెడ్డి గురువు ఆధ్వర్యంలో ప్రతి నెలా ఈ కార్యక్రమం నిర్వర్తిస్తున్నారు. ఈ సందర్భంగా అనఘాదత్తరక్ష మంత్ర హోమం ఘనంగా నిర్వహించారు.